
సాక్షి
అనంతపురం
శనివారం । 11 । అక్టోబర్ । 2025





### చీనీ టన్ను రూ.15 వేలు

అనంతపురం మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీ టన్ను గరిష్ట ధర రూ.15 వేలు, కనిష్టం రూ.8 వేల ప్రకారం విక్రయాలు జరిగాయి.



### టమాట కిలో రూ.19

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.19, కనిష్టం రూ.10, సరాసరి రూ.14 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
**34.4°/21.8°**

జిల్లా అంతటా శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా జడితో కూడిన తేలికపాటి వర్షాలు పడ్డాయి. ఈశాన్యం నుంచి నైరుతి దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

## న్యూస్‌రీల్

### బొమ్మనహాళ్‌లో కుండపోత వర్షం



బొమ్మనహాళ్ మండలంలో భారీ వర్షానికి ప్రవహిస్తున్న బండూరు వంక

**అనంతపురం అగ్రికల్చర్/ బొమ్మనహాళ్:** జిల్లాలో రెండు రోజులుగా అక్కడక్కడా వర్షాలు పడుతున్నాయి. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు 17 మండలాల పరిధిలో 7.8 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా బొమ్మనహాళ్ మండలంలో 84.2 మి.మీ కుండపోత వర్షం కురిసింది. మండలంలోని సిద్దరాంపురం, చంద్రగిరి, కురువల్లి గ్రామల్లో వరి, మొక్కజొన్న, మిరప, జొన్న తదితర పంటలు నీటమునిగాయి. చంద్రగిరిలో గ్రామదేవత ఆలయంలోకి వర్షపు నీరు చేరింది. రోడ్డుపై వర్షపు నీరు పారడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బండూరు వంక పారడంతో గోవిందవాడ, దర్గాహొన్నూరు తదితర గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వర్షం కారణంగా విద్యుత్ సరఫరా కూడా గ్రామాల్లో నిలిచిపోయింది. ఇక రాప్తాడు మండలంలో 41 మి.మీ, బెళుగుప్ప 24.8, కళ్యాణదుర్గం 21, పామిడి 20.4, బ్రహ్మసముద్రం 12 మి.మీతో పాటు తాడిపత్రి, గుంతకల్లు, విడపనకల్లు, అనంతపురం, గార్లదిన్నె, యల్లనూరు, పుట్లూరు, కంబదూరు, శెట్టూరు, గుమ్మఘట్ట తదితర మండలాల్లో జడితో కూడిన తేలికపాటి వర్షం కురిసింది. అక్టోబర్ సాధారణ వర్షపాతం 100.9 మి.మీ కాగా ప్రస్తుతానికి 18.8 మి.మీ నమోదైంది.



సిద్దరాంపురంలో నీట మునిగిన మొక్కజొన్న పంటను చూపుతున్న రైతు

# చీనీ మనుగడ ప్రశ్నార్థకం

చీనీ సాగుకు ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రసిద్ధి. ఇక్కడి నేలల్లో పండే చీనీ రుచికరంగా ఉంటుందని పేరు. దేశంలోనే అత్యధిక విస్తీర్ణంలో ఇక్కడే సాగవుతోంది. ఇక్కడి నుంచి ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి అవుతోంది. అలాంటి చీనీ తోటల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. రైతులు అవలంబిస్తున్న సాగు పద్ధతులే ఇందుకు కారణం. ఇదే విషయాన్ని ఉద్యానశాఖ అధ్యయన బృందం తేల్చి చెప్పింది.

- గడ్డిమందు పిచికారీ వల్ల తగ్గుతున్న చెట్ల జీవితకాలం
- తెగుళ్లు, చీడపీడల వ్యాప్తితో దిగుబడిపై ప్రభావం
- పెరిగిన పెట్టుబడులతో రైతులకు దక్కని లాభం
- ఉద్యానశాఖ అధ్యయనంలో బహిర్గతం
- ఉమ్మడి జిల్లాలో 52 వేల హెక్టార్లలో చీనీతోటలు



**అనంతపురం అగ్రికల్చర్:** జిల్లాలో చీనీ తోటల స్థితిగతులపై ఉద్యానశాఖ కమిషనరేట్ జేడీ డాక్టర్ దేవమునిరెడ్డి, తిరుపతి చీనీ, నిమ్మ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసరెడ్డితో కూడిన బృందం ఈ నెల 7, 8, 9 తేదీల్లో అధ్యయనం చేసింది. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల ఉద్యానశాఖ డీడీలు ఉమాదేవి, చంద్రశేఖర్, ఇతర క్షేత్రస్థాయి అధికారులతో కలిసి గార్లదిన్నె, నార్పల, కూడేరు, శింగనమల, రాప్తాడు, పుట్లూరు, యల్లనూరు, తాడిమర్రి, బత్తలపల్లి తదితర మండలాల్లో సాగు చేసిన చీనీతోటలను పరిశీలించి రైతుల అనుభవాలు తెలుసుకున్నారు. ప్రధానంగా మొక్కల ఎంపిక, పంటకాలంలో ఆచరిస్తున్న సాగు పద్ధతులు, చీడపీడల నివారణకు చేస్తున్న సస్యరక్షణ చర్యలు, నీటి నిర్వహణ, పంట కాలాలు, సీజన్ల వారీగా పంట కోతలు, మార్కెటింగ్, గిట్టుబాటు ధరలు తదితర అన్ని అంశాలపై లోతుగా అధ్యయనం చేశారు. మూడు రోజుల అధ్యయనంలో అనేక సమస్యలను గుర్తించారు. ఇదే పరిస్థితి కొనసాగితే మున్ముందు చీనీతోటల మనుగడకు విఘాతం కలిగే పరిస్థితి ఉందని చెబుతున్నారు. వారి అధ్యయనంలో షాకింగ్ విషయాలు వెలుగుచూశాయి.

**కలుపు మందుతో సమస్య..**

చీనీలో కలుపు నివారణకు ఇటీవలి కాలంలో రైతులు ఎక్కువగా నిషేధిత గ్లైపోసేట్ (గ్లైసిల్)తో పాటు మరి



గార్లదిన్నె సమీపంలో చీనీ రైతులతో మాట్లాడుతున్న ఉద్యానశాఖ జేడీ దేవమునిరెడ్డి, శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసరెడ్డి

కొన్ని ప్రమాదకర గడ్డి మందులు వాడుతుండటం వల్ల తోటల జీవితకాలం తగ్గిపోతున్నట్లు గుర్తించారు. ట్రాక్టర్ లేదా కూలీల ద్వారా కలుపు నివారణ చర్యలు చేపడితే భూమి గుల్లబారిపోయి పంటకు ఉపయోగపడుతుంది. ప్రమాదకరమైన గడ్డి మందు వాడటం వల్ల చెట్లు తొందరగా చనిపోతున్నాయి. లైఫ్‌టైం (జీవిత కాలం) 20 సంవత్సరాల నుంచి 10 సంవత్సరాలకు పడిపోయే ప్రమాదం ఉంది. విచ్చలవిడి రసాయన ఎరువులు, మోతాదుకు మించి పురుగు మందులు వాడుతుండటం వల్ల వైరస్ వ్యాప్తి పెరుగుతోంది. దీనివల్ల ఎండుతెగులు, వేరుకుళ్లు తెగులు, పొలుసు పురుగు, నల్లి, మంగు, బంకతెగులు లాంటి చీడపీడలు పెరిగిపోతున్నాయి. కాపునకు వచ్చిన పెద్ద పెద్ద చెట్లు సైతం ఉన్నఫళంగా ఎండిపోతున్నాయి.

- మొక్కల ఎంపికలో కూడా రైతులు పొరపాట్లు చేస్తున్నారు. నర్సరీల నుంచి వైరస్ ఉన్న మొక్కలను తెచ్చుకోవడం వల్ల తోటలు దెబ్బతింటున్నాయి. సూక్ష్మపోషకాల లోపం ఎక్కువగా ఉంది. రంగపూర్ రకం కాకుండా జంభేరి అంట్లు కట్టిన మొక్కలనే నిర్వాహకులు రైతులకు అంటగడుతుండటంతో చీనీ తోటల జీవితకాలం గణనీయంగా తగ్గిపోతోంది. ఎకరాకు రూ.50 వేలు ఉండాల్సిన పెట్టుబడి ఇప్పుడు రూ.లక్ష వరకు పెరిగింది. దీంతో పంటకు గిట్టుబాటు ధరలు లభించడం లేదు. దిగుబడులు కూడా ఎకరాకు 15 టన్నులు రావాల్సి ఉండగా 10 టన్నులకు పడిపోతోంది. రంగపూర్ అంటుమొక్కలతో పాటు సాగు పద్ధతుల్లో మేలైన యాజమాన్యం పాటిస్తే తప్ప రైతులకు చీనీ తోటలు గిట్టుబాటయ్యే పరిస్థితి లేదని బృందం సభ్యులు చెబుతున్నారు.

**శ్యాంపిల్స్ సేకరణ**

అధ్యయన బృందం సిఫారసు మేరకు ఎండుతెగులు, వేరుకుళ్లు తెగులు లాంటి ప్రధాన చీడపీడల వ్యాప్తికి స్పష్టమైన కారణాలు తెలుసుకునే నిమిత్తం చీనీ తోటల నుంచి శ్యాంపిల్స్ సేకరించి తిరుపతి పరిశోధన కేంద్రానికి పంపుతున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఉమాదేవి తెలిపారు. అలాగే నర్సరీ నుంచి తెచ్చిన మొక్కల్లోనే వైరస్ ఉందా లేదా తెలుసుకునేందుకు 'వైరల్ ఇండెక్సియస్' కింద తల్లి మొక్కతో పాటు చిన్న మొక్కల శ్యాంపిల్స్ సేకరించామన్నారు. అలాగే జిల్లాలో ఉన్న చీనీ రైతుల వివరాల సేకరించి వాట్సాప్ గ్రూప్ తయారు చేసి రైతులకు అవసరమైన సలహాలు, సాగు పద్ధతులు తెలియజేస్తామన్నారు.

**చీనీ సాగులో అగ్రస్థానం..**

రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా అనంతపురం జిల్లాలో 37 వేల హెక్టార్లు, శ్రీసత్యసాయి జిల్లాలో 15 వేల హెక్టార్లు.. వెరసి 52 వేల హెక్టార్ల భారీ విస్తీర్ణంలో చీనీ తోటలు సాగులో ఉన్నాయి. ఏటా అనంతపురం జిల్లాలో 7.43 లక్షల మెట్రిక్ టన్నులు, శ్రీసత్యసాయి జిల్లాలో 3 లక్షల మెట్రిక్ టన్నులు.. మొత్తంగా 10.43 లక్షల మెట్రిక్ టన్నుల ఫలసాయంతో దేశంలోనే అత్యధికంగా ఈ ప్రాంత రైతులు చీనీ పండిస్తున్నారు. జిల్లా నుంచి 70 శాతం పంట దిగుబడులు ఢిల్లీలో ఉన్న ప్రధాన మార్కెట్ అజాద్‌పూర్ మండీతో పాటు గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్తాన్ లాంటి పలు ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో చీనీ ద్వారా ఏటా రూ.2 వేల కోట్ల వరకు టర్నోవర్ జరుగుతున్నట్లు ఉద్యాన నివేదికలు చెబుతున్నాయి.

### గార్మెంట్స్ అభివృద్ధికి కృషి

- కలెక్టర్ సుడిగాలి పర్యటన



వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

**రాయదుర్గంటౌన్:** గార్మెంట్స్ పరిశ్రమ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. శుక్రవారం ఆయన రాయదుర్గం నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన చేశారు. తొలుత గుమ్మఘట్టలోని భైరవానితిప్ప ప్రాజెక్ట్‌ను సందర్శించారు. అక్కడి నుంచి నేరుగా రాయదుర్గంలోని కామన్ ఫెసిలిటీ సెంటర్ (సీఎఫ్‌సీ– పుర భవనం) పరిశీలించారు. క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి సీఎఫ్‌సీ ద్వారా యూనిట్లు ప్రారంభించి మహిళా కార్మికులకు కుట్టు శిక్షణతోపాటు ఉపాధి కల్పించే దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అక్కడి నుంచి ఏరియా ఆస్పత్రిని తనిఖీ చేసి.. వైద్య సేవలపై రోగులతో ఆరా తీశారు. వైద్యులు, సిబ్బంది కొరతపై ఆస్పత్రి సూపరింటెండెంట్ మెర్సీ జ్ఞానసుధను అడిగి తెలుసుకున్నారు. ప్రసవాల సంఖ్య పెంచాలని సూచించారు. అనంతరం పట్టణంలోని బళ్లారి రోడ్డులోని శ్రీఆంజనేయస్వామి కల్యాణమంటపంలో దుకాణదారులు ఏర్పాటు చేసిన జీఎస్టీ సంస్కరణలతో తగ్గిన టీవీలు, ఎలక్ట్రానిక్ వస్తువుల ప్రదర్శనను తిలకించారు. ఎవరైనా జీఎస్టీ అమలును పట్టించుకోకపోతే అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. 74 ఉడేగోళంలోని టెక్స్‌టైల్స్ పార్కును తనిఖీ చేసి యూనిట్లు విస్తృతంగా నడిచేందుకు ఔత్సాహికులకు అన్ని రకాల సహాయసహకారాలు అందించనున్నట్లు చెప్పారు. కార్యక్రమాల్లో కలెక్టర్ వెంట ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పాల్గొన్నారు. అంతకుముందు పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆయనతో కాసేపు చర్చించారు.

**రూ.10 లక్షలు మంజూరు**

**గుమ్మఘట్ట:** గుమ్మఘట్టలోని ఎంజేపీ గురుకుల పాఠశాల అభివృద్ధి పనుల కోసం రూ.10 లక్షలు మంజూరు చేస్తామని కలెక్టర్ ఆనంద్ ప్రకటించారు. శుక్రవారం గురుకుల పాఠశాలను సందర్శించిన ఆయన.. సమస్యలపై ప్రిన్సిపాల్ శ్రీదేవిని ఆరా తీశారు. అలాగే గోనబావి సమీపంలో అర్ధంతరంగా ఆగిపోయిన పాఠశాల భవన నిర్మాణ పనులను పూర్తి చేయాలన్నారు.

# ప్రజా శ్రేయస్సే లక్ష్యం

- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం
- నవంబర్ 22 వరకు కోటి సంతకాల సేకరణ
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత



కోటి సంతకాల ప్రజా ఉద్యమం పోస్టర్లు విడుదల చేస్తున్న అనంత, వైఎస్సార్‌సీపీ నాయకులు

**అనంతపురం కార్పొరేషన్:** ప్రజా శ్రేయస్సే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణతో పేదింటి బిడ్డల వైద్య విద్య కలను ముఖ్యమంత్రి చంద్రబాబు చిదిమేస్తున్నారన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపడుతున్న 'వైఎస్సార్‌సీపీ కోటి సంతకాల ప్రజా ఉద్యమం' విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో 'ప్రజా ఉద్యమం' పోస్టర్లను అనంత ఆవిష్కరించారు. ప్రభుత్వానికి కనువిప్పు కల్గించేందుకు కోటి మందితో సంతకాల సేకరణ చేపడుతున్నట్లు చెప్పారు. నవంబర్ 22 వరకు సంతకాల సేకరణ కొనసాగుతుందన్నారు. ఈ ప్రజా ఉద్యమంలో మేధావులు, ప్రజా సంఘాలు, వామపక్షాలు భాగస్వాములు కావాలన్నారు. ఆ తర్వాత నియోజకవర్గ కేంద్రాలు, జిల్లా కేంద్రంలో ర్యాలీలు చేపడతామన్నారు.

**నాడు ప్రజారోగ్యానికి పెద్దపీట**

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజారోగ్యానికి పెద్దపీట వేసిన విషయాన్ని అనంత గుర్తు చేశారు. ఆస్పత్రుల ఆధునికీకరణ, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, అర్బన్ హెల్త్ సెంటర్లను అందుబాటులోకి తెచ్చారన్నారు. వైద్య కళాశాలలు వస్తే అనుబంధంగా బోధనాస్పత్రులు వస్తాయని, సూపర్ స్పెషాలిటీ వైద్యం ప్రజలకు అందుతుందని అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భావించి రాష్ట్ర వ్యాప్తంగా రూ.8,300 కోట్లతో 17 వైద్య కళాశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారన్నారు. రెండేళ్లలోనే ఏడు వైద్య కళాశాలలు పూర్తి చేశారని, 2023–24లో ఐదు కళాశాలల్లో తరగతులు ప్రారంభమయ్యాయని వివరించారు. మరో రెండు కళాశాలలు గతేడాది ప్రారంభించాల్సి ఉందన్నారు. అయితే చంద్రబాబు తన బంధువులు, వర్గీయులకు లబ్ధి చేకూర్చడం కోసం కళాశాలలను ప్రైవేటీకరణ చేయాలని కుట్ర పన్నారన్నారు.

**బాబుకు ప్రైవేటీకరణపైనే మోజు**

చంద్రబాబుకు ప్రైవేటీకరణపై మోజు ఎక్కువ అని అనంత ధ్వజమెత్తారు. 1998లోనూ అనంతపురం మెడికల్ కళాశాలను ట్రస్ట్‌కు అప్పగించాలని ప్రయత్నించారని, అప్పుడు ప్రజా ఉద్యమం చేపడితే ఆయన దిగివచ్చారని గుర్తు చేశారు. మళ్లీ ఇప్పుడు నూతన వైద్య కళాశాలల ప్రైవేటీకరణ జపం చేస్తున్నారని మండిపడ్డారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేస్తూ ప్రజా ఉద్యమ కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాగజ్‌ఘర్ రిజ్వాన్, పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి వెన్నం శివరామిరెడ్డి, టీటీడీ బోర్డు మాజీ సభ్యులు అశ్వత్థనాయక్, అనుబంధ సంఘాల అధ్యక్షులు సాకే చంద్రశేఖర్, శ్రీదేవి, మల్లెమీద నరసింహులు, అమర్‌నాథ్‌రెడ్డి, చంద్రశేఖర్ యాదవ్, బాకే హబీబుల్లా, ఓబిరెడ్డి, పార్టీ నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్ రెడ్డి, నాయకులు చింతకుంట మధు, ఆసిఫ్, శ్రీనివాస్ దత్తా, సత్రసాల మంజునాథ్, జావెద్, భారతి, రాధాయాదవ్, ఉషా, హజరాబీ, కైలాష్, సాకే కుళ్లాయస్వామి, మీసాల రంగన్న, తలారి వెంకటేష్, ఉదయ్, కార్పొరేటర్లు కమల్‌భూషణ్, సాకే చంద్రలేఖ, ఇసాక్, తదితరులు పాల్గొన్నారు.

# స్తంభించిన ఎన్టీఆర్ వైద్య సేవలు

- నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో శస్త్రచికిత్సలు బంద్
- సర్వజనాస్పత్రికి పరుగులు పెట్టిన రోగులు

**అనంతపురం కార్పొరేషన్:** కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం ప్రజల ప్రాణం మీదకు తెస్తోంది. ఎన్టీఆర్ వైద్య సేవ కింద చేసిన చేసిన వైద్య చికిత్సలకు ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోవడంతో నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ పిలుపు మేరకు శుక్రవారం జిల్లాలోని 46 నెట్‌వర్క్ ఆస్పత్రులు ఎన్టీఆర్ వైద్య సేవలను నిలిపివేశాయి. దీంతో కేన్సర్, డయాలసిస్, ఆర్థో రోగులు, గర్భిణులు, బాలింతలు, హృద్రోగులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. అధిక సంఖ్యలో రోగులు ప్రభుత్వ సర్వజనాస్పత్రికి క్యూ కట్టారు. నగరంలోని ప్రముఖ ఆస్పత్రులు శస్త్రచికిత్సలను నిరాకరించడంతో రోగులు, వారి బంధువులు ఆందోళనకు లోనయ్యారు. కొందరు ప్రైవేట్‌గానే డబ్బులు వెచ్చించి శస్త్రచికిత్సలు చేయించు కోవాల్సి వచ్చింది.



- ఈ ఆటోలో కూర్చున్న పెద్దాయన ధర్మవరం మండలం పోతులనాగేపల్లికి చెందిన సాకే గంగన్న. నరాలు, గుండె తదితర సమస్యలతో అనంతపురం సాయినగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వచ్చాడు. కాగా ఎన్టీఆర్ వైద్య సేవలు లేవని, ప్రైవేట్‌గా చూపించుకోవాలంటే చాలా ఖర్చు అవుతుందని చెప్పడంతో నిరాశగా వెనుదిరిగారు.

**కేవలం 10 ప్రీ ఆథరైజేషన్‌లు**

రెగ్యులర్‌గా అనంతపురంలోని వివిధ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో రోజూ 150 నుంచి 200 మంది రోగులకు ప్రీ ఆథరైజేషన్‌లు నమోదు చేస్తారు. దాని ఆధారంగా ఎన్టీఆర్ వైద్య సేవ అనుమతితో శస్త్రచికిత్సలు చేస్తారు. కాగా ఆస్పత్రులు శస్త్రచికిత్సలకు నిరాకరించడంతో శుక్రవారం కేవలం 10 ప్రీ ఆథరైజేషన్‌లు మాత్రమే నమోదయ్యాయంటే పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇదే కొన సాగితే రానున్న రోజుల్లో రోగులు మరింత ఇబ్బందులు పడే అవకాశం లేకపోలేదు.

**ఎమర్జెన్సీ సేవలందుతున్నాయి**

జిల్లాలోని వివిధ ఆస్పత్రుల్లో ఎమర్జెన్సీ సేవలు అందుతున్నాయి. డయాలసిస్, కేన్సర్, తదితర రోగులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ తదితరులతో మాట్లాడాం. గుండె, నెఫ్రాలజీ, కేన్సర్ కేసులకు సత్వర వైద్యం అందించేలా చూడాలని చెప్పాం.

– డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, జిల్లా కో ఆర్డినేటర్, ఎన్టీఆర్ వైద్య సేవ

## క్లుప్తంగా

### డిమాండ్ల సాధనకు రైల్వే పెన్షనర్ల ఆందోళన



నిరసన తెలుపుతున్న రైల్వే పెన్షనర్లు

**గుంతకల్లుటౌన్:** రైల్వే పెన్షనర్లందరికీ 8వ వేతన పే కమిషన్‌ను వర్తింప చేయాలంటూ ఆలిండియా రిటైర్డ్ రైల్వేమెన్స్ ఫెడరేషన్ గుంతకల్లు డివిజన్ కార్యదర్శి వి.సుంకప్ప డిమాండ్ చేశారు. జాతీయ కమిటీ ఆదేశాల మేరకు శుక్రవారం రైల్వే పెన్షనర్ల న్యాయమైన డిమాండ్ల సాధనకు పెన్షనర్స్ ఆఫీసు నుంచి డీఆర్ఎం ఆఫీసు వరకూ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సుంకప్ప మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది మార్చి 25న పార్లమెంట్‌లో ఆమోదించిన ఫైనాన్స్ బిల్లును రద్దు చేయాలని, 18 నెలల డీఆర్ బకాయిలను చెల్లించాలని, పెన్షన్ అనేది ప్రతి ప్రభుత్వ ఉద్యోగి హక్కుగా గుర్తించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. న్యాయమైన డిమాండ్లను నెరవేర్చకపోతే దశలవారీగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం రైల్వే ఉన్నతాధికారికి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం నాయకులు, పెన్షనర్లు పాల్గొన్నారు.

### వ్యక్తి ఆత్మహత్య




కృష్ణమూర్తి (ఫైల్)

**ఉరవకొండ:** కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... ఉరవకొండలోని లాల్‌స్వామి పీర్లచావడి వద్ద నివాసముంటున్న చాకలి కృష్ణమూర్తి(31)కి ఎనిమిదేళ్ల క్రితం అనంతపురానికి చెందిన నీలిమతో వివాహమైంది. వీరికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుల వృత్తితో కుటుంబాన్ని పోషించుకునేవారు. కుటుంబ కలహాల నేపథ్యంలో 13 రోజుల క్రితం ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఇద్దరు పిల్లలను పిలుచుకుని నీలిమా వెళ్లిపోయింది. అప్పటి నుంచి భార్యాపిల్లల కోసం కృష్ణమూర్తి గాలిస్తూ ఉన్నాడు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం ఇంట్లో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి నరసింహులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

### 24 మందిపై కేసు నమోదు

**గుత్తి:** స్థల వివాదం కారణంగా స్థానిక పాత సీపీఐ కాలనీలో గురువారం ఓ వర్గానికి చెందిన భాగ్యమ్మపై మరో మరో వర్గం దాడికి తెగబడింది. ఘటనపై బాధితురాలు ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన ఎస్ఐ సురేష్.. శుక్రవారం 24 మందిపై కేసు నమోదు చేశారు. షెక్షావలి, దాదా ఖలందర్, వలి, మాబుతో పాటు మరో 20 మందిపై కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో తాము ఎవరినీ కొట్టలేదని పైగా తనను కులం పేరుతో దూషించారంటూ భాగ్యమ్మ, కళ్యాణి, హేమవతిపై సునీత అనే మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదుపై పోలీసులు విచారణ చేపట్టారు.

భౌగోళికంగా విభిన్న పరిస్థితులు కలిగిన ఉమ్మడిజిల్లాలో పర్యాటక అభివృద్ధికి ఎన్నో అవకాశాలున్నా.. అధికారులు ఎన్నో ప్రణాళికలు రూపొందిస్తున్నా.. అవన్నీ ప్రతిపాదనలకే పరిమితమవుతున్నాయి. మూడు రాష్ట్రాలకు అనుసంధానంగా ఉన్న ఉమ్మడి జిల్లా మీదుగా పలు జాతీయ రహదారులు కూడా విస్తరించాయి. గుత్తి మొదలు లేపాక్షి వరకూ పర్యాటకంగా మరింత అభివృద్ధికి వీలుంది. అయినా పర్యాటక అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించడం లేదు. ఫలితంగా ఉమ్మడి జిల్లాలో పర్యాటక రంగం నిర్వీర్యమవుతోంది.



గుత్తి కోట

# పర్యాటకం.. నిర్వీర్యం

- నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్న పర్యాటకాభివృద్ధి

**అనంతపురం కల్చరల్:** చూడతరమా అనే రీతిలో ఆహ్లాదాన్ని పంచుతున్న ఉమ్మడి జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు నిస్తేజంగా మారిపోతున్నాయి. మంచి ఆదాయ వనరుగా మారాల్సిన పర్యాటక రంగం కూటమి ప్రభుత్వం తీరు కారణంగా పడకేసింది. ఏటా సెప్టెంబరు 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని వైభవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. అయితే ఈ సారి పర్యాటక దినోత్సవం ఊసే లేకపోవడం కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని పలువురు విమర్శిస్తున్నారు.

**ఉమ్మడి జిల్లాలో పర్యాటక క్షేత్రాలు**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పర్యాటక క్షేత్రాలు కొకొల్లలుగా ఉన్నాయి. ఇందులో ప్రముఖంగా శిల్పకళకు కాణాచి అయిన లేపాక్షి, గిన్నీసు బుక్కులో చోటు దక్కించుకున్న తిమ్మమ్మ మర్రిమాను, రాయలేలిన పెనుకొండ, వేదాంతం జాలువారిన యోగి వేమన సమాధి, హిరణ్యకశ్యప వధతో సాక్షాత్తు స్వయంభూగా వెలసిన నారసింహుడి దివ్య క్షేత్రం ఖాద్రి, గుత్తి కోట, శిల్పకళ ఉట్టిపడే తాడిపత్రి బుగ్గ రామలింగేశ్వరం, చింతల వేంకటరమణ దేవాలయాలు ఉమ్మడి అనంతకు వన్నె తెచ్చాయి. గతేడాది గుత్తి కోటను సందర్శించిన అప్పటి కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్... గుత్తికోట అభివృద్ధికి రూ.50 లక్షలు కేటాయిస్తామంటూ స్పష్టమైన హామీ ఇచ్చారు. చివరకు ఆయన బదిలీ అయ్యారే తప్ప ఆ నిధులు మాత్రం మంజూరు కాలేదు. అధికారంలోకి వచ్చే ముందు పర్యాటక రంగంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతామన్న కూటమి పెద్దల మాటలు కూడా నీటి మూటలేనని అర్థమైపోయింది.



లేపాక్షి నంది

**మంత్రుల ఇలాకాలో కనపడని పర్యాటకం**

ఉమ్మడి అనంతపురం జిల్లాలో అధికభాగం ప్రసిద్ధ పర్యాటక క్షేత్రాలు శ్రీసత్యసాయి జిల్లాలో ఉండిపోగా అనంతలోనూ పెన్నహోబిలం, సూర్యదేవాలయం, జంబూద్వీపచక్రం వంటి ప్రసిద్ధ పర్యాటక ప్రాంతాలు మంత్రి పయ్యావుల కేశవ్ ఇలాకాలో ఉన్నాయి. వీటి అభివృద్ధిపై మంత్రి దృష్టి సారించలేదని తెలుస్తోంది. గుత్తి కోట, యాడికి గుహలు, కసాపురం, గూగూడు, పప్పూరు అశ్వత్థం వంటివి వాటి అభివృద్ధిని కూడా అటకెక్కించారు. శ్రీసత్యసాయి జిల్లాలో మంత్రి సవిత ప్రాతినిధ్యం వహిస్తున్న పెనుకొండలో పర్యాటకం పూర్తిగా పడకేసింది. గత ప్రభుత్వంలో పెనుకొండ ఉత్సవాల కోసం నూతన రహదారులు వేసి పర్యాటకులను ఆకర్షించారు. ఆ తర్వాత పర్యాటకం ఊసే లేకుండా పోయింది.

**దేవాలయాల పరిస్థితి అంతే**

పర్యాటకాభివృద్ధిలో కీలక పాత్ర పోషించే ఆధ్యాత్మిక క్షేత్రాల్లో సరైన వసతులు లేకపోవడంతో అవి కాస్తా వెలవెలబోతున్నాయి. గత ప్రభుత్వంలో అనేక దేవాలయాల అభివృద్ధికి అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిధులను మంజూరు చేశారు. గార్లదిన్నె మండలం యర్రగుంట్లలోని వేంకటేశ్వర, వినాయక దేవాలయాలకు రూ.70 లక్షలు మంజూరు కాగా ఆలయం తరఫున రూ.14 లక్షలు కార్పస్ ఫండ్‌నూ చెల్లించారు. అయితే ప్రభుత్వం మారడంతో నిధులు కాస్తా స్థానిక ఎమ్మెల్యే సిఫార్సుల మేరకు వాడుకోవాలనే నిబంధన విధించారు. దీంతో రూ.70 లక్షలు అందకుండా పోయాయి.

### ప్రకటనల్లోనే గుత్తి కోట అభివృద్ధి



గతేడాది పర్యాటక దినోత్సవం నాడు అప్పటి కలెక్టర్ వినోద్ కుమార్ గుత్తి కోటను సందర్శించారు. గుత్తి కోట పరిరక్షణకు నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తామని హామీ కూడా ఇచ్చారు. ఈ విషయంగా ప్రజాప్రతినిధులందరినీ అనేకసార్లు కలిసి విన్నవించాం. అయినా గుత్తి కోట అభివృద్ధి మాత్రం ప్రకటనలకే పరిమితమైంది. ఇది ఒక్క గుత్తి కోటదే కాదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి. పర్యాటక రంగం అభివృద్ధిపై ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టి సారించాలి.

– రాజా రాయలసీమ, గుత్తి కోట పరిరక్షణ సమితి ప్రతినిధి

### కమీషన్లకు కక్కుర్తి పడితే ఎలా?



గత ప్రభుత్వ హయాంలో మరే జిల్లాలోనూ జరగనంతగా ఆలయాల నిర్మాణాలు, పునర్నిర్మాణాలకు, జీర్ణోద్ధరణ పనులు నిధులు వచ్చేలా చేశాము. ఎండోమెంటు సీజీఎఫ్ నిధులను కేటాయించాలని అడిగితే అప్పటి సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. గత ప్రభుత్వం కేటాయించిన నిధులను సద్వినియోగం చేసుకోవడంపై ప్రస్తుత పాలకులు దృష్టి సారించక కమీషన్ల కోసం కక్కుర్తి పడడంతో అవి కాస్త మంజూరు కాక ఆగిపోయాయి.

– జ్వాలాపురం శ్రీకాంత్, దేవదాయ శాఖ మాజీ సలహాదారుడు

## ఉపాధి అక్రమాలపై విచారణ చేపట్టండి

- డ్వామా పీడీకి మాజీ ఎంపీ రంగయ్య వినతి

**అనంతపురం టౌన్:** కళ్యాణదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా ఉపాధి హామీ పథకంలో టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలంటూ డ్వామా పీడీ సలీం బాషాకు మాజీ ఎంపీ రంగయ్య ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం సలీంబాషాను కలసి వినతి పత్రం అందజేసి, మాట్లాడారు. కంబదూరు మండల వ్యాప్తంగా ఉపాధి పనులు చేయకుండానే టీడీపీ నాయకులతో ములాఖత్ అయిన ఫీల్డ్ అసిస్టెంట్లు అక్రమాలకు పాల్పడ్డారన్నారు. పనులకు రాని కూలీల పేర్లను సైతం మస్టర్లలో నమోదు చేసి బిల్లులు పెద్ద ఎత్తున డ్రా చేశారన్నారు. మెట్ట భూముల్లో ఉద్యాన పంటల సాగులోనూ అక్రమాలు చోటు చేసుకున్నాయన్నారు. నిధులను కొల్లగొట్టిన వారి నుంచి సొమ్ము రికవరీ చేయాలని, లేకుంటే డ్వామా కార్యాలయం ఎదుట ఆందోళ కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ నేతలు భీమేష్, గంగాధర్ తదితరులు ఉన్నారు.

**వాటర్ షెడ్ పనులు వేగవంతం చేయండి**



డ్వామా పీడీతో మాట్లాడుతున్న రంగయ్య

వాటర్ షెడ్ పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను డ్వామా పీడి సలీంబాషా ఆదేశించారు. జిల్లాలో చేపట్టిన వాటర్ షెడ్ పనులపై అధికారులతో శుక్రవారం డ్వామా కార్యాలయంలో ఆయన సమీక్షించారు. జిల్లా వ్యాప్తంగా 7 ప్రాజెక్టుల్లో చేపట్టనున్న పనులు రానున్న 3 నెలల్లో 100 శాతం పూర్తి కావాలన్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 848 పనులు జరుగుతున్నాయని, వీటిలో 70 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయని మిగిలిన పనులు సైతం సకాలంలో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో వాటర్ షెడ్ ఏపీడీ సుధాకర్‌రెడ్డి, కృష్ణచైతన్యతో పాటు నియోజకవర్గ ఏపీడీలు పాల్గొన్నారు.

## ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీ బాధ్యతల స్వీకరణ

**అనంతపురం సెంట్రల్:** మహిళా శిశు సంక్షేమశాఖ ఇన్‌చార్జ్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా అరుణకుమారి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కో–ఆపరేటివ్ సొసైటీ అధికారిగా పనిచేస్తున్న ఆమెకు ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. దీంతో శుక్రవారం ఉదయం బాధ్యతలు స్వీకరించిన ఆమెకు పలువురు ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

## రాష్ట్రంలో ధృతరాష్ట్రుడి పాలన

- విపరీతమైన ధనదాహంతో టీడీపీ ఎమ్మెల్యేలు దోచుకుంటున్నారు
- ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కాపాడుకుందాం
- వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ పరిశీలకులు రమేష్‌కుమార్‌రెడ్డి
- ప్రభుత్వ తీరును ఎండగడదాం : మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి (చిత్రంలో) వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ పరిశీలకులు రమేష్‌కుమార్‌రెడ్డి, తాడిపత్రి రమేష్‌రెడ్డి, తదితరులు

**రాప్తాడు రూరల్:** చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్రంలో ధృతరాష్ట్ర పాలన సాగుతోందని వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ పరిశీలకులు రెడ్డిగారి రమేష్‌కుమార్ రెడ్డి మండిపడ్డారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ అధిష్టానం పిలుపు మేరకు రాప్తాడు నియోజకవర్గంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. అనంతపురం రూరల్ మండలం ఆకుతోటపల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు తాడిపత్రి రమేష్‌రెడ్డితో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్లమెంటు పరిశీలకులు రమేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రజల కోసం నాడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన మెడికల్ కళాశాలలను నేడు చంద్రబాబు ప్రైవేట్‌పరం చేస్తున్నారని మండిపడ్డారు. 30 లక్షల మంది విద్యార్థులకు తల్లికి వందనం ఎగ్గొట్టారన్నారు. మహిళలకు నెలకు రూ.1,500 ఇస్తామని చెప్పి వంచించారన్నారు. టీడీపీ ఎమ్మెల్యేలు విపరీతమైన ధనదాహంతో అక్రమ వసూళ్లు, అరాచకాలకు తెరలేపారన్నారు. కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై తీవ్ర వివక్ష చూపిస్తోందన్నారు.

**ప్రతి ఒక్కరూ సంతకాలు చేయాలి**

తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ప్రతి ఒక్కరూ సంతకాలు చేయాలని పిలుపునిచ్చారు. సూపర్ సిక్స్‌తో పాటు 200 హామీలు ఇచ్చిన చంద్రబాబు కేవలం 2–3 పథకాలు పాక్షికంగా అమలు చేశారన్నారు. కళ్లు ఆర్పకుండా అపద్ధాలు చెప్పడంలో చంద్రబాబు తనకు తానే సాటి అని మరోసారి నిరూపించుకున్నారన్నారు. జగనన్న ముఖ్యమంత్రి కాకముందు కేవలం 11 ప్రభుత్వ మెడికల్ కళాశాలలుండేవన్నారు. ఆయన వచ్చిన తర్వాత 17 కొత్త కళాశాలలను తీసుకొచ్చారన్నారు. ఈ క్రమంలో ఏటా 5 వేలమంది పేద విద్యార్థులు ఉచితంగా వైద్య విద్య చదువుకునే అవకాశాన్ని కల్పించారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కొత్త మెడికల్ కళాశాలల నిర్మాణాలను ఆపేసిందన్నారు. ఇప్పుడు ప్రైవేట్‌పరం చేసేందుకు పూనుకుందని, ప్రభుత్వ చర్యలను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. దోచుకోవడంలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత రాష్ట్రంలోనే ఆల్‌టైం రికార్డ్ సాధిస్తోందన్నారు. ఒక్క పాపంపేటలోనే రూ.వేల కోట్ల విలువైన 500 ఎకరాలకు పైగా శోత్రియం భూములను తన బంధువుల పేరుపై అక్రమంగా జీపీఏ చేయించుకున్నారన్నారు. హంద్రీ–నీవా కాలువకు లైనింగ్ వేయడం వల్ల నియోజకవర్గంలో భూగర్భజలాలు అడుగంటి 2 లక్షల ఎకరాలకు నీరు అందకుండా పోతోందన్నారు. పరిటాల సునీత ఇచ్చిన లేఖ వల్ల 50 వేల పేదల గృహ నిర్మాణాలు ఆగిపోయాయన్నారు.కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గురుప్రసాద్, రాప్తాడు ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, పార్టీ మండల కన్వీనర్లు గోవిందరెడ్డి, పవన్, ఎంపీటీసీ సభ్యులు సునీల్‌దత్త రెడ్డి, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్రిక్తతల నడుమ మాజీ వలంటీరు మృతదేహానికి పోస్టుమార్టం




ఆస్పత్రి ఎదుట గుమికూడిన లత్తవరం గ్రామస్తులు

**ఉరవకొండ:** మండలంలోని లత్తవరం సమీపంలో హంద్రీ–నీవా కాలువ వద్ద బండరాళ్ల మధ్య వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు, మాజీ వలంటీరు కొడిగె మహేష్ అనుమానాస్పద స్థితిలో గురువారం మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో మృతదేహానికి ఉరవకొండలోని సీహెచ్‌సీలో శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించేలా పోలీసులు చర్యలు తీసుకున్నారు. అయితే పోస్టుమార్టం చేసేందుకు స్థానిక వైద్యాధికారి నిరాకరించాడు. అనుమానాస్పద మృతి కావడంతో జిల్లా సర్వజనాస్పత్రిలో నిపుణుల పర్యవేక్షణలో పోస్టుమార్టం చేయించాలని సూచించారు. దీంతో మృతుడి కుటుంబసభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ సీహెచ్‌సీ ఎదుట రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. లత్తవరం గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో సీహెచ్‌సీ వద్ద ఉద్రిక్తత నెలకొంది. దీంతో పోలీసులు జోక్యం చేసుకుని సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎస్‌వీఎస్ చౌదరితో మాట్లాడి పోస్టుమార్టం చేయించేలా ఒప్పించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి బాధిత కుటుంబసభ్యులు తరలించారు.

## నూర్పిడి యంత్రం బోల్తా

- మహిళ కూలీ మృతి



మృతురాలు నాగలక్ష్మి

**గార్లదిన్నె:** వేరుశనగ నూర్పిడి యంత్రం బోల్తాపడిన ఘటనలో ఓ మహిళా కూలీ దుర్మరణం పాలైంది. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు.. శింగనమల మండలం తరిమెల గ్రామానికి చెందిన 10 మంది వ్యవసాయ కూలీలు శుక్రవారం మధ్యాహ్నం గుడ్డాలపల్లిలో వేరుశనగ నూర్పిడికి చింతలమేకలపల్లికి చెందిన నూర్పిడి యంత్రం బెంచీపై కూర్చొని బయలుదేరారు. ఓ రైతు పొలంలో పని ముగించుకుని మరో రైతు పొలానికి వెళుతుండగా గుడ్డాలపల్లి రైల్వే గేట్ సమీపంలో నూర్పిడి యంత్రం బోల్తాపడింది. బెంచీపై కూర్చొన్న కూలీలంతా చెల్లాచెదురుగా పడ్డారు. యంత్రం కింద పడి నాగలక్ష్మి (35) అక్కడికక్కడే మృతి చెందింది. రంగస్వామికి కాలు, చెయ్యి విరిగాయి. మిగిలిన కూలీలు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు, 108 సిబ్బంది అక్కడకు చేరుకుని క్షతగాత్రులను అనంతపురంలోని జీజీహెచ్‌కు తరలించారు. కాగా, మృతి చెందిన నాగలక్ష్మికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

## బియ్యం పంపిణీలో డీలర్ చేతివాటం

- తక్కువ వేస్తున్నాడంటూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట మహిళ నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న లక్ష్మీదేవి

**కళ్యాణదుర్గం:** డీలర్ చేతివాటం ప్రదర్శించి తక్కువ తూకంతో బియ్యం వేస్తున్నాడంటూ కళ్యాణదుర్గంలోని వడ్డే కాలనీకి చెందిన లబ్ధిదారురాలు సల్లా లక్ష్మీదేవి వాపోయింది. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఒంటరిగానే నిరసన వ్యక్తం చేసింది. వివరాలు.. సల్లా లక్ష్మీదేవికి ప్రభుత్వం అంత్యోదయ కార్డు (2803192003) జారీ చేసింది.నిబంధన మేరకు ఆమెకు ప్రతి నెలా 35 కిలోల బియ్యం అందాలి. అయితే వడ్డే కాలనీలో ఉన్న రేషన్ షాప్ (12223070) డీలర్ ప్రతి నెలా ఆమెతో వేలిముద్ర వేయించుకుని 22 కిలోల బియ్యం మాత్రమే ఇస్తున్నాడు. పలుమార్లు అడిగినా వచ్చే నెలలో వేస్తానంటూ నమ్మబలికేవాడు. ఈ విషయంగా మనస్తాపం చెందిన బాధితురాలు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని నిరసన వ్యక్తం చేసింది. అనంతరం తహసీల్దార్ భాస్కర్‌ను కలిసి తన గోడు వెల్లబోసుకుంది. స్పందించిన తహసీల్దార్ వెంటనే సదరు రేషన్ షాపును పరిశీలించాలని వీఆర్వో గంగాధర్‌ను ఆదేశించారు. వీఆర్వో తనతో పాటు బాధితురాలిని పిలుచుకెళ్లి న్యాయపరంగా ఆమెకు దక్కాల్సిన 35 కిలోల బియ్యాన్ని ఇప్పించారు.

## నంది విగ్రహం అపహరణ



ఆలయం వద్ద విచారణ చేపట్టిన పోలీసులు


**పెద్దవడుగూరు:** మండలంలోని పి.వీరన్నపల్లిలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయం ఎదుట ఉన్న నంది విగ్రహాన్ని గురువారం రాత్రి దుండగులు అపహరించారు. గురువారం సాయంత్రం నుంచి వర్షం కురుస్తుండడంతో గ్రామస్తులు అటుగా వెళ్లలేకపోయారు. శుక్రవారం ఉదయం ఆలయానికి వెళ్లిన భక్తులు.. నంది విగ్రహం కనిపించడకపోవడంతో విషయాన్ని గ్రామస్తులకు తెలిపారు. సమాచారం అందుకున్న ఎస్ఐ ఆంజనేయులు, సిబ్బంది అక్కడకు చేరుకుని విచారణ చేపట్టారు. పూజారి ఆదిశేషయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

## పెళ్లి పెటాకులు చేసిన ఫోన్‌కాల్

- ఆ అమ్మాయితో నాకు పరిచయం ఉందంటూ పెళ్లి చేసుకునే యువకుడికి ఫోన్‌కాల్
- ఆగిన పెళ్లి.. లబోదిబోమంటున్న యువతి తల్లిదండ్రులు
- యువకుడిపై కేసు నమోదు

**రాప్తాడు రూరల్:** నేడు, రేపు (శనివారం, ఆదివారం) పెళ్లి. ఇరు కుటుంబాల్లోనూ ఏర్పాట్లన్నీ సిద్ధమయ్యాయి. ఇంతలో వరుడికి అందిన ఫోన్ కాల్‌తో పెళ్లి కాస్త పెటాకులైంది. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం రూరల్ మండలం మన్నీల గ్రామంలో ఓ యువతికి, మరో ప్రాంతానికి చెందిన యువకుడికి పెద్దల సమక్షంలో వివాహం నిశ్చయమైంది. శనివారం ముహూర్తం, ఆదివారం తలంబ్రాలకు నిర్ణయించుకుని రెండు కుటుంబాల్లోనూ అన్ని ఏర్పాట్లూ సిద్ధం చేసుకున్నారు. ఇంతలో మన్నీల గ్రామానికి చెందిన వివాహితుడైన బాలచంద్ర.. వరుడి ఫోన్ నంబరు సేకరించుకుని శుక్రవారం కాల్ చేశాడు. 'నువ్వు పెళ్లి చేసుకునే అమ్మాయితో నాకు వ్యక్తిగత పరిచయం ఉంది. అలాంటి అమ్మాయిని ఎలా పెళ్లి చేసుకుంటావు. నీ ఇష్టం. కావాలంటే మేమిద్దం కలిసి ఉన్న ఫొటో కూడా పంపుతాను చూడు' అంటూ ఇద్దరూ కలిసి తీసుకున్న ఫొటో పంపాడు. దీంతో పెళ్లికొడుకుతో పాటు వారి కుటుంబ సభ్యులు కంగుతిని పెళ్లి రద్దు చేసుకుని వెళ్లిపోయారు. దీంతో వధువు తరఫు కుటుంబ సభ్యులు, బంధువులు లబోదిబోమంటూ ఇటుకలపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ కూతురి పెళ్లి చెడిపోవడానికి కారణమైన బాలచంద్ర కుటుంబ సభ్యులపై దాడి చేశారు.

## సైబర్ నేరగాళ్ల వలలో రైతు



బాధితుడు కావలి రామానాయుడు

**బొమ్మనహాళ్:** మండలంలోని కొలగానహళ్లి గ్రామానికి చెందిన రైతు కావలి రామానాయుడు సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుని నగదు కోల్పోయాడు. వ్యవసాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్న ఆయన అత్యవసర పరిస్థితుల్లో తన పొలాన్ని అమ్మి రూ.4.50 లక్షలు ఉద్దేహాళ్‌లోని ఏపీజీబీలో ఉన్న తన ఖాతాలో జమ చేసి ఉంచాడు. ఇటీవల రూ.3.50 లక్షలు డ్రా చేశారు. ఈ నెల 9న సాయంత్రం 5 గంటల సమయంలో రైతు మొబైల్‌లో కోటక్ మహీంద్ర అనే యాప్‌ను ఓపెన్ చేయగా తన ఏపీజీబీ బ్యాంక్ ఖాతా నుంచి 5 సార్లు రూ.19,999లు చొప్పున మొత్తం రూ. 1 లక్ష నగదు మరో ఖాతాకు బదిలీ అయినట్లుగా మెసేజ్‌లు అందాయి. దీంతో వెంటనే బ్యాంక్ అధికారులను కలసి విషయాన్ని తెలపడంతో వారు ఖాతాను పరిశీలించారు. ఖాతా నుంచి నగదును సైబర్ నేరగాళ్లు అపహరించినట్లుగా నిర్ధారించుకుని వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. దీంతో బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు 1930 నంబర్‌కి సమాచారం అందించాడు.

## ఆర్టీసీ వాహనం నుంచి డీజిల్ విక్రయం

- ఇద్దరు డ్రైవర్లను పట్టుకున్న అధికారులు

**యాడికి:** మండలంలోని వేములపాడు సమీపంలో లేబై వద్ద కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపోకు చెందిన లాజిస్టిక్ వాహనం నుంచి అక్రమంగా డీజిల్ విక్రయిస్తున్న ఇద్దరు డ్రైవర్లను ఆ జిల్లా విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపో నుంచి కడపకు బయల్దేరిన ఆర్టీసీ లాజిస్టిక్ వాహనం శుక్రవారం తెల్లవారుజామున వేములపాడు వద్దకు చేరుకుంది. లేబై వద్ద వాహనాన్ని డ్రైవర్ ఆపి ట్యాంక్ నుంచి 20 లీటర్ల క్యాన్‌లోకి డీజిల్ తీస్తుండగా వెనుకనే అనుసరిస్తూ వచ్చిన కర్నూలు విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. డ్రైవర్ శామ్యూల్‌తో పాటు కార్మికుడు వెంకటేష్‌ను అదుపులోకి తీసుకుని యాడికి పీఎస్‌లో అప్పగించారు. కొంత కాలంగా ఈ తంతు కొనసాగుతోందని, విజిలెన్స్ అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో నిఘా వేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు పేర్కొన్నారు.



పోలీసుల అదుపులో ఉన్న ఆర్టీసీ లాజిస్టిక్ వాహనం

# ఆలోచింపజేసిన సాంస్కృతిక సంబరం







ఐద్వా రాష్ట్ర మహాసభల సందర్భంగా కృష్ణ కళామందిరంలో సాంస్కృతిక ప్రదర్శనలు ఇస్తున్న కళాకారులు

అనంతపురం కల్చరల్: మహిళల సమస్యలు, సాధికారత ఇతివృత్తంగా సాగిన సాంస్కృతిక సంబరాలు ఆద్యంతం ఆలోచింపజేశాయి. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) 16వ రాష్ట్ర మహాసభల సందర్భంగా అనంతపురంలో సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. మూడు రోజులపాటు సాగే ఈ ఉత్సవాల్లో రెండో రోజు శుక్రవారం రాత్రి కృష్ణ మందిరం హోరెత్తింది. నాట్యాచార్యులు సంధ్యామూర్తి శిష్యబృందాలు శాస్త్రీయ నృత్యాలతో మహిళా శక్తికి నీరాజనాలర్పించాయి. వివిధ పాఠశాలల విద్యార్థులు కర్రసాము, జానపద నాట్యాలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ముఖ్యంగా మేఘన, లక్ష్మీప్రసన్న మైమ్ (ముఖాభినయం) కళతో మహిళల సమస్యలను అద్భుతంగా ప్రదర్శించారు. వరకట్న సమస్యను ప్రతిబింబిస్తూ సౌమ్య బృందం ప్రదర్శించిన లఘునాటిక ఆలోచింపజేసింది. అంతకుముందు దర్శకుడు తరిమెల రాజు, కెమెరామెన్ పవన్ మత్తు పదార్థాల వల్ల కలిగే ప్రమాదాలపై చిత్రీకరించిన 'డీఎఫ్ఐ' పోస్టర్లను ఆవిష్కరించారు.

**ఐద్వా కృషి అభినందనీయం**

సాంస్కృతికోత్సవాల సమావేశాన్ని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు పండిట్ రియాజుద్దీన్ వేమన పద్యాలాపనతో ఆరంభించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ నిర్మలమ్మ మాట్లాడుతూ మహిళల సమస్యలపై ఐద్వా చేస్తున్న కృషిని అభినందించారు. ఐద్వాకు అందరం అండగా నిలబడాలని సూచించారు. ఐద్వా నాయకురాళ్లు సావిత్రి, రామాంజనమ్మ, శ్యామల, చంద్రిక, అశ్వినితో పాటు సాంస్కృతిక కార్యక్రమాల పర్యవేక్షకుడు వన్నూర్ మాస్టర్ మాట్లాడారు. ఐద్వా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.



హాజరైన ప్రజలు




సాంస్కృతిక ఉత్సవాల్లో మాట్లాడుతున్న విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ నిర్మలమ్మ

# హామీలు, రైతుకూలీల సమస్యలపై పోరాటం




మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి

అనంతపురం అర్బన్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుతో పాటు సాగుభూమి, ఉపాధి కూలీల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం సాగిస్తామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి తెలిపారు. శుక్రవారం నగరంలోని సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు రంగయ్య అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కేశవరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అధికారంలోకి వచ్చిన తరువాత విస్మరించారన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల చొప్పున స్థలం ఇవ్వడంతో పాటు పక్కా గృహ నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలన్నారు. దళిత, గిరిజన వాడల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. నిరుపేదలకు ఒక్కొక్కరికి హెక్టార్ చొప్పున సాగు భూమి పంపిణీ చేయాలన్నారు. రిజర్వుడు ఫారెస్ట్ భూముల సాగు చేస్తున్న గిరిజనులకు అటవీ హక్కు చట్టం కింద భూమి పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పెద్దయ్య, సంగప్ప, దేవేంద్ర, నామగణి, నారాయణమ్మ, శ్రీనివాసులు, చిన్నరాయుడు, ప్రసాద్, రామాంజినేయులు పెద్దపెద్దయ్య, మలరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుడిపై దాడి అమానుషం

అనంతపురం ఎడ్యుకేషన్: నంద్యాల జిల్లా గోనెగండ్ల మండలం గాజులదిన్నె ప్రాథమిక పాఠశాల టీచరు చెన్న బసవరాజుపై విద్యార్థి తండ్రి దాడి చేయడం అమానుషమని ఏపీటీఎఫ్ (1938) నాయకులు మండిపడ్డారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసనాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటసుబ్బయ్య, రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ రఫీ, గౌరవ అధ్యక్షులు వరప్రసాద్, సీనియర్ నాయకులు కులశేఖర్ రెడ్డి, వెంకటరెడ్డి, రవీంద్ర సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఇటీవల పాఠశాలల్లో వేర్వేరు కార్యక్రమాల్లో బయటి వ్యక్తుల ప్రభావం ఎక్కువ కావడం వల్ల ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని మండిపడ్డారు. పిల్లలకు భయం లేదని, తల్లిదండ్రులకూ బాధ్యత లేదని, ఇటువంటి సమయంలో విధులు ఏ విధంగా నిర్వహించాలో ఉపాధ్యాయులకు అర్థం కావడం లేదన్నారు. భావి భారత పౌరులను తయారు చేసే ఉపాధ్యాయులు భయం గుప్పిట్లో ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దాడికి పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఎన్టీఆర్ వైద్య సేవపై 'కూటమి' నిర్లక్ష్యం

- సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి ధ్వజం




కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

అనంతపురం అర్బన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజావ్యతిరేక పాలన సాగిస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి పాళ్యం నారాయణస్వామి ధ్వజమెత్తారు. పేదలకు ఉచిత వైద్యసేవలు అందిస్తున్న ఎన్టీఆర్ వైద్యసేవ విషయంలో నిర్లక్ష్యధోరణి అవలంబిస్తోందని మండిపడ్డారు. పేదలకు మెరుగైన కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందకుండా చేస్తోందని తీవ్రస్థాయిలో విమర్శించారు. బంద్ అయిన ఎన్టీఆర్ వైద్య సేవలను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట నాయకులు ధర్నా చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి, సహాయ కార్యదర్శులు మల్లికార్జున, రాజారెడ్డి మాట్లాడారు. ఎన్టీఆర్ వైద్యసేవకు సంబంధించిన బిల్లులు ఏడాది కాలంగా చెల్లించని కారణంగా వైద్య సేవలు నిలివేస్తున్నామని నెట్‌వర్క్ ఆస్పత్రులు చెప్పినా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిదన్నారు. కరువుకు నిలయమైన అనంతపురం జిల్లాలో ఉచిత వైద్య సేవలు అందక ఎవరైనా చనిపోతే అందుకు ప్రభుత్వమే బాధ్యతవహించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, లింగమయ్య, రామకృష్ణ, రమణయ్య, అల్లీపీరా, రాజేష్‌గౌడ్, సంతోష్ కుమార్, కృష్ణుడు, రమేష్, కుళ్లాయిస్వామి, ఎల్లుట్ల నారాయణస్వామి, చాంద్‌బాషా, యశోదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# యువకుడి ఆచూకీ లభ్యం

రాప్తాడు: ఈ నెల 4న కనిపించకుండా పోయిన రాప్తాడు మండలం పాలచెర్ల గ్రామానికి చెందిన అట్టే మాలమ్మ, లింగమయ్య దంపతుల మూడో కుమారుడు పోతులయ్య ఆచూకీని పోలీసులు గుర్తించి, శుక్రవారం తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. ఈ నెల 4న మధ్యాహ్నం 2 గంటల సమయంలో తోట దగ్గరికి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లిన పోతులయ్య.. ఆ తర్వాత తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లుగా సెల్ఫీ వీడియో తీసి నార్పల మండలంలోని నాయనవారిపల్లి గ్రామానికి చెందిన గౌరవ పరమేష్‌కు షేర్ చేశాడు. అనంతరం కనిపించకుండా పోయాడు. సెల్ఫీ వీడియో ఆధారంగా ఈ నెల 5న కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఈ నెల 4న పురుగుల మందు తాగిన తర్వాత తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి చేరుకుని చికిత్స పొందాడు. అనంతరం వైద్యుల సూచనమేరకు కర్నూలుకు వెళ్లి అక్కడి ఆస్పత్రిలో చేరాడు. విషయం తెలుసుకున్న పోలీసులు కర్నూలుకు వెళ్లి శుక్రవారం పోతులయ్యను పిలుచుకుని వచ్చారు. తహసీల్దార్ సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగించారు.

## మార్కెట్లోకి 'మారుతీ విక్టరీస్'



కారును మార్కెట్లోకి విడుదల చేస్తున్న డీటీసీ వీర్రాజు

అనంతపురం సెంట్రల్: నగరంలో రుద్రంపేట బైపాస్ సమీపంలోని జయలక్ష్మి మారుతి ఆటోమోటివ్ షోరూంలో నూతన ఎస్‌యూవీ విక్టరీస్ వాహనాన్ని శుక్రవారం ఉప రవాణా కమిషనర్ వీర్రాజు మార్కెట్లోకి విడుదల చేశారు. అధునాతన ఫీచర్స్ కలిగిన ఈ వాహనాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చినట్లు షోరూం ప్రతినిధులు తెలిపారు. మారుతి సంస్థ నుంచి మొదటి ఎస్‌యూవీ వాహనం ఇదేనని వివరించారు. కార్యక్రమంలో షోరూం సీఈఓ రామ్‌వికాస్, జీఎం హరికృష్ణ, బ్యాంక్ మేనేజర్లు పాల్గొన్నారు.

## ఆలమూరు వద్ద చైన్ స్నాచింగ్

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం ఆలమూరు సమీపంలో శుక్రవారం చైన్‌స్నాచింగ్ జరిగింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు..ఆత్మకూరు మండలం యాలేరుకు చెందిన కృష్ణమ్మకు ఆలమూరు సమీపంలో వ్యవసాయ పొలాలు ఉన్నాయి. పొలానికి వెళుతుండగా.. అనంతపురం వైపునకు బైకులో వస్తున్న ఇద్దరు యువకులు ఆమె మెడలోని చైను లాక్కుని ఉడాయించారు. బాధితురాలు గట్టిగా కేకలు వేసినా ఉపయోగం లేకపోయింది. రూరల్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రేపు 'జుగల్బందీ' పుస్తకావిష్కరణ

అనంతపురం కల్చరల్: అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ఆధ్వర్యంలో ప్రముఖ కవి, విమర్శకుడు నందవరం కేశవరెడ్డి రచించిన 'జుగల్బందీ' పుస్తకావిష్కరణ ఆదివారం జరగనుంది. నగరంలోని ఎన్జీఓ హోంలో ఆదివారం ఉదయం 10.30 గంటలకు పుస్తకావిష్కరణ జరుగుతుందని అరసం కార్యదర్శి తన్నీరు నాగేంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, డాక్టర్ శాంతి నారాయణ పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని, సాహితీ అభిమానులు విచ్చేయాలని కోరారు.

# స్కాన్ చేయండయ్యా!

- సిబ్బందిని బతిమాలుకున్న రోగులు
- సర్వజనాస్పత్రి రేడియాలజీలో ఇదీ పరిస్థితి



సెమినార్ రూంలో పీజీ వైద్యుల కాలక్షేపం



తమ పేరు నమోదు చేయాలంటూ బతిమాలుకుంటున్న రోగులు

అనంతపురం మెడికల్: 'అయ్యా..ఉదయం నుంచి వేచి ఉన్నాం. అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేయండి. కాళ్లు నొప్పెడుతున్నాయ్ బాబూ..మీకు మొక్కుతాం.. మొదట మమ్మల్ని నమోదు చేసుకోండి' అంటూ రోగులు రేడియాలజీ సిబ్బందిని బతిమాలుకున్న ఘటన శుక్రవారం సర్వజనాస్పత్రిలో జరిగింది. అల్ట్రాసౌండ్ స్కానింగ్ కోసం రోగులు గంటల తరబడి వేచిచూసి నీరసించిపోయారు. కేన్సర్ రోగులు, వృద్ధులు, బాలింతలు, చిన్నపిల్లలు ప్రత్యక్ష నరకం చూశారు. ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని రేడియాలజీ విభాగంలో విధులు నిర్వర్తించే రేడియాలజిస్టులు (అసిస్టెంట్ ప్రొఫెసర్లు) ఎప్పుడూ వారి ప్రైవేట్ ఆస్పత్రులపైనే శ్రద్ధ చూపుతున్నారు. దీనికి తోడు శుక్రవారం పీజీ వైద్యులు సైతం క్లాసు పేరుతో రేడియాలజీ సెమినార్ హాల్లో కూర్చుని పిచ్చాపాటి మాట్లాడుకుంటూ కాలక్షేపం చేశారు. పరిస్థితి దయనీయంగా ఉన్నప్పటికీ పాలనాధికారి సైతం రేడియాలజీ విభాగం వైపు కన్నెత్తి చూడలేదు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రమణ్యం పరీక్ష ఉందంటూ మైసూరుకు వెళ్లారు. డాక్టర్ శౌరీకి ఇన్‌చార్జ్ బాధ్యతలు ఇచ్చారు. ఆయన సైతం ఇక్కడి పరిస్థితిని పట్టించుకోకపోవడం గమనార్హం. కీలకమైన విభాగంలో రోగులకు సేవలందించడంలో జాప్యం జరుగుతుంటే ఆస్పత్రి యంత్రాంగం ప్రేక్షకపాత్ర పోషించడం విమర్శలకు తావిచ్చింది.

# విద్యతోనే బాలికల అభ్యున్నతి




బాలికా దినోత్సవంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు హేమలత, లావణ్య

- అంతర్జాతీయ బాలికా దినోత్సవంలో వక్తలు

రాప్తాడు/ఆత్మకూరు: విద్యతోనే బాలికల అభ్యున్నతి సాధ్యమని, అందువల్ల తల్లిదండ్రులు తమ కుమార్తెలను బాగా చదివించాలని వక్తలు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం రాప్తాడు మండల పరిధిలోని ధర్మవరం పంగల్ రోడ్డు సమీపంలోని కేజీబీవీ, ఆత్మకూరు కేజీబీవీలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. పంగల్ రోడ్డు సమీపంలోని కేజీబీవీలో జరిగిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హేమలత మాట్లాడారు. ఆడపిల్లలను ప్రోత్సహిస్తే తప్పకుండా అత్యున్నత స్థాయిలో ఉంటారన్నారు. ఎవరూ కూడా బాల్య వివాహాలను ప్రోత్సహించవద్దన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ముత్యాలమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు విజయలక్ష్మి, ముత్యాలమ్మ, లక్ష్మీదేవి, భారతి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు. ఇక ఆత్మకూరు కేజీబీవీలో జరిగిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య మాట్లాడారు. బాలిక హక్కుల రక్షణకు అందరం పాటుపడదామన్నారు. బాల్య వివాహాలు నేరమని, ఎవరు ప్రోత్సహించినా శిక్షార్హులవుతారన్నారు. బాలికలు ఏదైనా కష్టంలో ఉన్నప్పుడు 1098, 100, 181 టోల్‌ఫ్రీ నంబర్లకు ఫోన్ చేస్తే వెంటనే సాయం అందుతుందన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ టీమారోజ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## స్పోకెన్ ఇంగ్లిష్‌లో ఉచిత శిక్షణ

అనంతపురం కల్చరల్: శ్రీశారద సపారె చారిటబుల్ ట్రస్టు వారి ఆధ్వర్యంలో చిన్నారులకు రోజూ సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు వారం రోజుల పాటు ఇంగ్లిష్ గ్రామర్, స్పోకెన్ ఇంగ్లిష్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు నిర్వాహకులు రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. అరవిందనగర్‌లోని ఇంగ్లిష్ లర్నర్స్ హబ్ వేదికగా శిక్షణ ఉంటుందని, ఆసక్తి గలవారు మరిన్ని వివరాలకు 9290200675 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

## నేడు 'ప్రత్యేక' పిల్లలకు మెడికల్ అసెస్‌మెంట్ క్యాంపు

అనంతపురం ఎడ్యుకేషన్: అనంతపురం అర్బన్ నియోజకవర్గానికి సంబంధించిన ప్రత్యేక అవసరాల పిల్లల కోసం సమగ్రశిక్ష సహిత విద్య విభాగం ఆధ్వర్యంలో శనివారం ఉదయం కొత్తూరు ప్రభుత్వ బాలుర పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో మెడికల్ అసెస్‌మెంట్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ శైలజ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అలిమ్కో ప్రతినిధులు హాజరై అవసరమైన పిల్లలను ఉపకరణాలకు ఎంపిక చేస్తారన్నారు. విద్యాశాఖ అధికారులు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, ఐఈఆర్పీలు చొరవ తీసుకుని వీలైనంతమంది ప్రత్యేక అవసరాల పిల్లలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలని కోరారు.

రాప్తాడు: నియోజకవర్గ స్థాయి మెడికల్ అసెస్మెంట్ మెడికల్ క్యాంపు (2025–26 సంవత్సరానికి సంబంధించి) శనివారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ మల్లికార్జున తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే క్యాంపులో ఉచిత సహాయ ఉపకరణాలు, పరికరాల కోసం 18 ఏళ్లలోపు వయస్సు గల ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తిస్తామన్నారు. క్యాంపునకు వచ్చే వారు ఫొటో, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్, మెడికల్ సర్టిఫికెట్, రేషన్ కార్డుతో తీసుకురావాలన్నారు. వివరాలకు 9676729595, 8096812424 నంబర్లలో సంప్రదించాలన్నారు.

## క్లుప్తంగా

### డీఎస్సీ-25 టీచర్లకు ముగిసిన శిక్షణ



మాట్లాడుతున్న సమగ్రశిక్ష ఏపీసీ శైలజ

అనంతపురం ఎడ్యుకేషన్: డీఎస్సీ-25 ద్వారా ఎంపికైన కొత్త టీచర్లకు ఈ నెల 3 నుంచి ప్రారంభమైన శిక్షణ శుక్రవారం ముగిసింది. మొత్తం మూడుచోట్ల శిక్షణ జరిగింది. బుక్కరాయసముద్రం మండలం కొర్రపాడు సమీపంలోని సిమ్యాట్ ప్రాంతీయ శిక్షణ కేంద్రంతో పాటు బుక్కరాయసముద్రంలోని విజయభారతి డీఎడ్ కళాశాల, అనంతపురం రూరల్ మండలంలోని వివేకానంద జూనియర్ కళాశాలలో కేంద్రాలు ఏర్పాటు చేశారు. అన్ని కేంద్రాల్లోనూ శిక్షణ ప్రశాంతంగా జరిగింది. ముగింపు సందర్భంగా డీఈఓ ప్రసాద్‌బాబు, సమగ్రశిక్ష ఏపీసీ శైలజ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పిల్లలకు నాణ్యమైన విద్య బోధించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు శాయశక్తులా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓలు శ్రీనివాసరావు, మల్లారెడ్డి, కోర్స్ డైరెక్టర్ విజయకుమారి, ఎంఈఓ-2లు మదన్ మోహన్, లింగా నాయక్, ఏఎంఓ వేణుగోపాల్, అసిస్టెంట్ ఏఎంఓ పనిరాజ్ పాల్గొన్నారు.

### వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు

అనంతపురం ఎడ్యుకేషన్: రాష్ట్రంలో పేదల కోసం గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేసే నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం విరమించుకోకపోతే ప్రజాగ్రహానికి గురికావాల్సి వస్తుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పేరూరు కురుబ నాగిరెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని పేద, బడుగు, బలహీన వర్గాల వైద్య సేవల నిమిత్తం దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రీ తీసుకురాని విధంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 17 మెడికల్ కళాశాలలను తీసుకొచ్చారని గుర్తు చేశారు. చంద్రబాబుకు పేద ప్రజలు బాగుపడడం ఇష్టం లేకనే వైద్య విద్యను నీరుగార్చి భ్రష్టు పట్టించాలని చూస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. ఇప్పటికైనా ప్రైవేటీకరణ అంశాన్ని విరమించుకోకపోతే ప్రజలు గట్టి గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

### ఘనంగా పోషణ్ మహోత్సవం



ర్యాలీ చేస్తున్న అంగన్వాడీ, ఆరోగ్య సిబ్బంది

రాప్తాడురూరల్: ఐసీడీఎస్ అనంతపురం రూరల్ 5వ సెక్టార్ పరిధిలోని విద్యారణ్యనగర్‌లో శుక్రవారం పోషణ్ మహా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పోషకాహార ప్రాముఖ్యతపై అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. కుటుంబ సభ్యుల ఆరోగ్యం, పిల్లల అభివృద్ధి, గర్భిణుల శ్రేయస్సులో పురుషుల సహకారం తప్పనిసరి అని అన్నారు. అలాగే పిల్లల పోషణ, విద్య, ఆరోగ్యం కోసం నిర్ణయాలు తీసుకోవడంలో తండ్రుల పాత్ర కీలకమైనదన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం లక్ష్మి, ఎంఎస్‌కే ఝాన్సీ, అంగన్వాడీ కార్యకర్తలు మాధవి, చంద్రకళ, అరుణ, గౌతమి, లక్ష్మీదేవి, ఆశ వర్కర్ నాగలక్ష్మి పాల్గొన్నారు.

### ప్రమాదమున్నా పట్టించుకోరా?



ఆదమరిస్తే అంతే సంగతులు..

అనంతపురం రూరల్: రుద్రంపేట పంచాయతీ చంద్రబాబునగర్‌కు వెళ్లే మెయిన్ రోడ్డులో డ్రెయినేజీ రక్షణ గోడ శిథిలమైంది. ఇప్పటికే ఎంతోమంది ప్రమాదాలకు గురయ్యారు. విషయాన్ని పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకుపోయినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు.

### పోలీసు సిబ్బందికి అవగాహన

అనంతపురం: జిల్లాలోని పోలీస్ సిబ్బందికి శాలరీ ప్యాకేజీ, ప్రయోజనాలు, హెల్త్ ఇన్సూరెన్స్ తదితర అంశాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. జిల్లా పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో ఏఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్ బాషా, ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. శాలరీ ప్యాకేజీ స్కీం వల్ల ఎలాంటి ఉపయోగాలు ఉన్నాయో ఎస్‌బీఐ సాయి నగర్ బ్రాంచ్ ఏజీఎం నందగోపాల్, డిప్యూటీ బ్రాంచ్ మేనేజర్ నాగకుమార్ వివరించారు. కార్యక్రమంలో ఆర్ఐ పవన్‌కుమార్, పలువురు ఆర్ఎస్ఐలు, ఏఆర్ ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

## శిశుగృహను తనిఖీ చేసిన పీడీ



శిశుగృహలో చిన్నారుల వివరాలు తెలుసుకుంటున్న ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీ అరుణకుమారి

అనంతపురం సెంట్రల్: మహిళా,శిశు సంక్షేమశాఖ ఇన్‌చార్జ్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా శుక్రవారం అరుణకుమారి బాధ్యతలు చేపట్టిన వెంటనే శిశుగృహను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల నవజాత శిశువు నిరూప్ మృతి రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం అయిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో పీడీ నాగమణి సస్పెండ్ కావడం... జిల్లా కో ఆపరేటివ్ అధికారిగా పనిచేస్తున్న అరుణకుమారికి ఇన్‌చార్జ్ పీడీగా బాధ్యతలను అప్పగించారు. ఇన్‌చార్జ్ పీడీ వచ్చీ రాగానే శిశుగృహను తనిఖీ చేయడం గమనార్హం. చిన్నారి నిరూప్ ఎలా చనిపోయాడు? ప్రస్తుతం ఉన్న చిన్నారుల ఆరోగ్య పరిస్థితి ఏవిధంగా ఉంది.. తదితర అంశాలను శిశుగృహ మేనేజర్ దీప్తి, సోషల్ వర్కర్ లక్ష్మీదేవిలను అడిగి తెలుసుకున్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాప్తాడు: విద్యుత్ శాఖ రాప్తాడు సెక్షన్ పరిధిలోని 11 కేవీ ఆర్డీటీ ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మండలంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ మహమ్మద్ గౌస్ మొహిద్దీన్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ధర్మవరం పంగల్ రోడ్డు, ఆర్డీటీ స్టేడియం, అనంత టౌన్ షిప్, ఈనాడు కార్యాలయం, ముస్లిం మైనార్టీ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

## క్యాజువాలిటీలో దయనీయం



క్యాజువాలిటీలో సీ ప్యాప్ మీద శ్వాస తీసుకుంటున్న నాగమ్మ బెడ్‌పైనే మరో రోగిని చేర్చిన దృశ్యం

అనంతపురం మెడికల్: కూటమి ప్రభుత్వంలో వైద్య ప్రమాణాలు రోజురోజుకూ దిగజారుతున్నాయనేందుకు అద్దం పట్టే దృశ్యాలు సర్వజనాస్పత్రిలో తరచూ వెలుగు చూస్తున్నాయి. శుక్రవారం సర్వజనాస్పత్రిలోని క్యాజువాలిటీలో ముదిగుబ్బ మండలానికి చెందిన చిన్న నాగమ్మ శ్వాసకోశ సంబంధిత సమస్యతో ఆస్పత్రికి వచ్చింది. ఆమె పరిస్థితి విషమించడంతో వైద్యులు సీ ప్యాప్ మీద ఆక్సిజన్‌ను అందిస్తున్నారు. అదే సమయంలో అదే బెడ్‌పై తీవ్ర విష జ్వరంతో బాధపడుతున్న అనంతపురం రూరల్ ప్రాంతం పిల్లిగుండ్ల కాలనీకి చెందిన మారెక్కను చేర్చారు. సర్వజనాస్పత్రిలో మౌలిక వసతుల కల్పనలో కూటమి ప్రభుత్వ వైఫల్యానికి ఇదే నిదర్శనమని చూసిన పలువురు వ్యాఖ్యానించారు.

## భక్తిశ్రద్ధలతో సంకష్టహర చతుర్థి

అనంతపురం కల్చరల్: సంకష్టహర చతుర్థి వ్రతాన్ని శుక్రవారం రాత్రి పలు ఆలయాలలో ఘనంగా ఆచరించారు. పాతూరు చెరువుకట్టపై వెలసిన వరసిద్ధి వినాయకాలయం, రైల్వే స్టేషన్ సమీపంలోని వినాయక దేవస్థానం, మూడో రోడ్డులోని బాబా మందిరం, రామనగర్‌లోని మెయిన్‌రోడ్డు శ్రీసిద్ధి వినాయక ఆలయం తదితర చోట్ల భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి సామూహిక వ్రతాలలో పాల్గొన్నారు.

## రోడ్డుపైనే మట్టి దిబ్బలు



రోడ్డుపై రోజుల తరబడి ఉంటున్న మట్టి దిబ్బ

అనంతపురం రూరల్: అనంతపురం రూరల్ పంచాయతీ టీవీ టవర్ పక్క ఉన్న రోడ్డుపై మట్టి దిబ్బలు రోజుల తరబడి ఉంచడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. చెన్నై ప్రధాన రహదారి నుంచి ఉప్పరపల్లి పంచాయతీ పరిధిలోని గురుదాస్‌కాలనీ, ఆటోనగర్ తదితర కాలనీలకు వెళ్లే ప్రధాన రహదారిలో నిర్మాణం చేపడుతున్న భవన యాజమానులు తారురోడ్డుపై ఇసుక, మట్టి, స్టీల్ రేకులు అడ్డదిడ్డంగా ఉంచారు. అధికారులు స్పందించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.